క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చర్యలు



బిల్లలమెట్టకు విద్యుత్ దీపాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: ఇటీవల భీమిలి, సంగివలసలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానికులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చిన సమస్యలకు శనివారం పరిష్కారం లభించింది. ఇందులో భాగంగా 200 కుటుంబాలు నివసిస్తూ ఎనిమిదేళ్లుగా వీధిదీపాలు లేని బిల్లలమెట్టపై ఆరు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ మరో 15 స్తంభాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే నమ్మివానిపేట కాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఈ కార్యక్రమాలను శిల్ల కరుణాకరరెడ్డి, వంశీరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు వందలాది మంది భక్తులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో గోవింద నామస్మరణ మార్మోగింది. సాయంత్రం నిర్వహించిన కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆరు కేంద్రాల్లో కానిస్టేబుల్ ఎంపిక పరీక్ష

ఆనందపురం : మండలంలో ఆరు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక పరీక్ష జరగనుంది. మిందివానిపాలెంలోని వీతం ఇంజినీరింగ్ కళాశాల, శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, గిడిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాల, తర్లువాడ యలమర్తి కళాశాల, గుడిలోవలోని ఆల్‌అమీర్ కళాశాలలోని రెండు కేంద్రాల్లో ఎంపిక పరీక్ష జరగనుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే ఈ ఎంపిక పరీక్షకు 4,258 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఈ మేరకు స్థానిక పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

గిరిజన భాషలపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు

కొమ్మాది: ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన భాషలపై రుషికొండలో గల గిరిజన భవన్‌లో శిక్షణ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడే కోయ, సవర, ఆదివాసీ ఒరియా, జాతపు, కువి, కొండదొర భాషలు వంటి లిపి లేని గిరిజన భాషలను నిర్మించిన ఎంటీవీ – ఎంఎల్ఈ ఉపాధ్యాయ శిక్షణ మాడ్యూళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో మాతృభాష ఆధారిత బహుభాష విద్యను సమగ్ర విద్య, నాణ్యమైన విద్యను ప్రోత్సహించడానికి ఈ వర్క్‌షాప్ కృషి చేస్తుందన్నారు. బోధన, అభ్యాసం, నైపుణ్యం, అభివృద్ధి, పిల్లల అభ్యాస అలవాట్లు అంచనా వేయడం, ప్రాథమిక స్థాయిలో లేదా మాతృభాషలో చదవడం, ఇతర భాషల సహాయంతో విద్యారంగాన్ని బలోపేతం చేసే అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ రకాల అభ్యాసాల కార్యకలాపాలను నేరుగా అమలు చేయడానికి ఈ మాన్యువల్ ఉపాధ్యాయులకు సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రూ.7.43 లక్షలు లబ్ధిపొందిన పైడమ్మకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలను నేరుగా కలుసుకొని సమస్యలు పరిష్కరించడానికే అధికారులతో కలిసి 'గడప గడపకు' వస్తున్నామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మామిడిలోవలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత మామిడిలోవలో సుమారు రూ.10 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశామని చెప్పారు. జగనన్న కాలనీ నిర్మాణ పనులను పెద్ద ఎత్తున చేపట్టామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలనే తలంపుతోనే జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని వివరించారు. 'నాడు – నేడు' ద్వారా విద్యారంగంలో పెను మార్పులు తీసుకొచ్చి కార్పొరేట్ స్థాయి విద్య అందించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, కుటుంబ వైద్య విధానం వల్ల పేదలకు నేరుగా ఇంటి వద్దకే వైద్యం అందడంతో ఎంతో మేలు జరుగుతోందని చెప్పారు. అర్హతను బట్టి ఏడాదికి రెండు సార్లు సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్న ప్రభుత్వం దేశంలో మన దేనని తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, అభివృద్ధి కార్యక్రమాలు నిర్విరామంగా జరగాలన్నా రాబోయే ఎన్నికల్లో మరలా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, కాలువలు నిర్మించాలని, దోబీఖానాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు పావాడ గౌతమి, మండల ఉపాధ్యక్షుడు పాండ్రింకి శ్రీను, నాయకులు బలిరెడ్డి మహేష్, డోల దేవుడు, బొట్టా రామకృష్ణ, లెంక రాంబాబు, బలిరెడ్డి రమేష్, పినిశెట్టి సింహాచలంనాయుడు, రౌతు వెంకటరావు, ఆబోతు అప్పలరాము, పడాల రాము, కోరాడ వెంకట రమణారావు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి రూ.7.43 లక్షల లబ్ధి

మామిడిలోవలో ఓ పేద కుటుంబానికి అక్షరాలా రూ.7.43 లక్షల లబ్ధి చేకూరింది. దెంకాడ పైడమ్మ కుటుంబానికి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఆసరా కింద రూ.52 వేలు, ఆరోగ్యశ్రీ కింద రూ.1.43 లక్షలు, చేయూత కింద రూ.37వేలు, వైఎస్సార్ పింఛన్ కానుక కింద రూ.55 వేలు, రూ.2 లక్షలు విలువ చేసే ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 2.5 లక్షలు ఇలా అన్ని పథకాలు కలిపి ఆమెకు రూ.7.43 లక్షల లబ్ధి చూకూరింది. ఈ మేరకు ఆమెకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కరపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు కిడ్నీ పావడంతో శస్త్ర చికిత్స జరిగిందని, బ్రెస్ట్ క్యాన్సర్ రావడంతో చికిత్స తీసుకున్నానని చెప్పింది. అయితే ఆ వైద్యసేవలన్నీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా అందాయని, ఇంకా ప్రాణాలతో బతికి ఉన్నానంటే అంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చలవే అని... ఆయనే మరలా ముఖ్యమంత్రి కావాలని పైడమ్మ కోరుకుంది.

ప్రమాదాల నివారణ బాధ్యత డ్రైవర్లదే



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ బాలాజీరావు

తగరపువలస: రహదారులపై ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా ఆటో, మోటారు వాహనాల డ్రైవర్లే జాగ్రత్త వహించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు బి.బాలాజీరావు, కె.సుమన్‌కుమార్, ఐ.మాధవి కోరారు. రహదారి భద్రతా వారోత్సవాల అవగాహన కార్యక్రమం అంబేడ్కర్ కూడలిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుకోకుండా ప్రమాదం జరిగితే గాయపడిన వారిని గోల్డెన్ అవర్‌గా పేర్కొనే సమయంలో దగ్గరలోని ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ఇందుకోసం అంబులెన్స్‌ల కోసం వేచి ఉండటం వల్ల క్షతగాత్రుల పరిస్థితి విషమించే ప్రమాదం ఉందన్నారు. ప్రతీ వారం తమ వాహనాలను తనిఖీ చేసుకుని లోపాలు సరిచేసుకోవాలన్నారు. జాతీయ రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనాలు ప్రమాదానికి గురయ్యేటప్పుడు క్షతగాత్రులు, మృతుల కుటుంబాలకు వాహన బీమా కొండంత రక్షణగా నిలుస్తుందన్నారు. అదే సమయంలో వాహనానికి కాలుష్యానికి సంబంధించిన సర్టిఫికెట్ కూడా అవసరమన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మ్యాక్సీ క్యాబ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు గుజ్జు సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆటో కార్మికుల సంఘం అధ్యక్షుడు చిల్ల శివారెడ్డి, ప్రతినిధులు జీవీ రమణ, గంటా నరసింగరావు, వేణు, నీలాపు రామిరెడ్డి, చేట్ల శ్రీనివాసరెడ్డి, ఊడికల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోతులతో ప్రమాదకరంగా రోడ్లు





గతుకులు, గుంతలతో ప్రమాదకరంగా తగరపువలస, కుమ్మరిపాలెం రోడ్లు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రధాన రోడ్లు అనేక చోట్ల దెబ్బతినడంతో ఆ మార్గాల్లో ప్రయాణం ప్రమాదాలతో కూడుకోవడంతోపాటు ప్రాణాంతకంగా మారింది. భీమిలి నుంచి తగరపువలసకు వెళ్లే ప్రధాన మార్గంలో జమ్మి చెరువు, వుడా మైదానం సమీపంలో రోడ్డుపై ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా చోట్ల గతుకులు, గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు వెళ్లడానికి ఎంతో ఇబ్బందికరంగా మారింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు తిరగడం పెద్ద సమస్యగా ఉంది. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. గతంలో ఇదే మార్గంలో జీరుపేట సమీపంలో రోడ్డు మధ్యలో ఇటువంటి గుంతల వల్ల జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో అదుగురు చనిపోయారు. ప్రస్తుతం అదే ప్రమాదకర పరిస్థితి ఈ మార్గంలో నెలకొంది. అదేవిధంగా భీమిలి నుంచి జాతీయ రహదారి వరకు వెళ్లే కుమ్మరిపాలెం రోడ్డులో కూడా ఇటువంటి ఇబ్బందులే ఉన్నాయి. ఈ మార్గంలో పెద్ద గోతులు ఉండడం మరింత ఇబ్బందిగా మారింది. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో కొందరు తీవ్రంగా గాయపడగా ఒక వ్యక్తి చనిపోయాడు. సంబంధిత అధికారులు స్పందించి ఈ మార్గాల్లో కొత్త రోడ్లు నిర్మించాలని, అప్పటి వరకూ కనీసం గోతులను పూడ్చి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

జీవీఎంసీ పైప్‌లైనుకు శశి విద్యాసంస్థలు కన్నం



సంగివలస శశి విద్యాసంస్థల ముందు విరగ్గొట్టిన జీవీఎంసీ తాగునీటి పైప్‌లైను



మరమ్మతులు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు పరిధి సంగివలస సమీపంలోని శశి విద్యాసంస్థల యాజమాన్యం వలందపేట గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు కన్నం చేశారు. దీంతో శనివారం ఆ గ్రామానికి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. శశి విద్యాసంస్థల యాజమాన్యం తమ ఆవరణలో వాడుక నీటిని జాతీయ రహదారికి అనుసంధానంగా డ్రైనేజీకి మళ్లించడానికి శుక్రవారం జేసీబీతో కాలువ తవ్వారు. ముందుగా ఈ విషయాన్ని జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగానికి తెలియజేయకుండా ఇష్టారాజ్యంగా తవ్వేయడంతో అడుగున్నర మేరకు పైపు పగిలిపోయి తాగునీరు వృథాగా సర్వీస్ రోడ్డులో ప్రవహించింది. ఈ విషయం తెలుసుకున్న జీవీఎంసీ తాగునీటి విభాగం సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించారు. ఎవరుపడితే వారు ఇష్టానుసారంగా సంబంధిత విభాగాల అధికారులకు సమాచారం ఇవ్వకుండా తవ్వకాలు చేపట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వలందపేట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు, నాయకులు

ఆనందపురం : మండలంలోని వెల్లంకిలో శనివారం బీకే స్టీల్ కంపెనీ యాజమాన్యం సమకూర్చిన దుప్పట్లను పేదలకు పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలో సుమారు 600 మంది వృద్ధులు, వికలాంగులకు కంపెనీకి చెందిన సావిత్రి దేవి బన్సల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా పేదలకు పలు రకాల సేవలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, నాయకులు కాకర వెంకట రమణ, పిన్నింటి వెంకటరమణ, కె.చంద్రమౌళి, కె.శ్రీనివాసరావు, పడాల రాము, తోనంగి అప్పారావు రెడ్డి, చెన్నా సత్యం, కె.దామోదర రావు, పడాల రమణ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లామెట్ట పాఠశాలను సందర్శించిన కేంద్ర బృందం



బంగ్లామెట్ట పాఠశాల వద్ద ప్రధానమంతి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా బృందం ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా తరపున రాష్ట్ర విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం జిల్లా కో ఆర్డినేటర్ జె.ఎస్.శాస్త్రి, భీమిలి ఎంఈవో కేపీ బాలామణి తదితరులు శనివారం సందర్శించారు. తరగతి గదులు, రికార్డులు పరిశీలించారు. డిజిటల్ లైబ్రరీ, తాగునీటి వసతి, మధ్యాహ్న భోజనం, యూనిఫారాలు, బూట్లు, పాఠ్యపుస్తకాలు తనిఖీ చేశారు. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకానికి భీమిలిలో అయిదు పాఠశాలలను ఎంపిక చేయనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు అనంతలక్ష్మి, వంశీ, ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు బుగత మల్లిక, పిన్నింటి నాగమణి, నరహరిశెట్టి రమేష్ పాల్గొన్నారు.

లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం పరిశీలన



సంతపేట అంబేడ్కర్ హైస్కూల్‌లో పాఠ్య ప్రణాళికలు పరిశీలిస్తున్న సారిపల్లి త్రినాథ్



విద్యార్థులతో మాట్లాడుతున్న లెక్చరర్ గొట్టేటి రవి

తగరపువలస: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్)ను శనివారం భీమిలి డైట్ లెక్చరర్, పరిశీలకుడు సారిపల్లి త్రినాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళికలు, టీచింగ్ నోట్స్, డైరీలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల నోట్ బుక్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులే విజయవంతం చేయాలని కోరారు. కోవిడ్ కాలం కంటే ముందు విద్యార్థుల ప్రగతితో పోలిస్తే ప్రస్తుతం వారు సాధించిన అభివృద్ధి నమోదు చేయాలన్నారు. లిప్ పథకం అమలు చేయడానికి సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు జగన్నాథస్వామి, ఉపాధ్యాయులు ఎస్.చిన్నంనాయుడు, ఎస్.జగదీష్, ఎం.మురళీకృష్ణ, ఎం.అనసూయ, జీకే రాధ, గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీయూపీ పాఠశాల పరిశీలన

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో గల ఎంపీయూపీ పాఠశాలను జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) లెక్చరర్ గొట్టేటి రవి శనివారం పరిశీలించారు. ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి నోటు పుస్తకాలు, వర్క్ పుస్తకాలు తనిఖీ చేశారు. అదేవిధంగా ఎల్ఐపీ ఏవిధంగా అమలవుతోందో అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు స్థానిక ఉపాధ్యాయులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీల సంక్షేమం

తగరపువలస: రాష్ట్రంలో బీసీల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందని నాగవంశ కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ అన్నారు. శనివారం ఆమె భీమిలిలో మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ 136 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. వీటి కాలపరిమితి పొడిగించడం ద్వారా భవిష్యత్‌లో ఇంకా అనేక మందికి రుణాలు, సంక్షేమ పథకాలు చేరుతాయన్నారు. బీసీలను వెనుకబడిన వారిగా కాకుండా రాష్ట్రానికి వెన్నుముకగా సీఎం జగన్ గుర్తించారన్నారు. జ్యోతీరావు పూలే ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు అన్నారు.

సేవ చేసేందుకు మరింత అవకాశం

మధురవాడ: ఆంధ్రప్రదేశ్ నగరాలు కార్పొరేషన్ బోర్డు పదవీ కాలం పెంపుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ బోర్డు పదవీ కాలం గత ఏడాది డిసెంబరుతో ముగిసింది. ఈ నేపథ్యంలో పదవీ కాలం పొడిగిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మధురవాడ రేవళ్లపాలెంకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పిళ్లా సత్యనారాయణ భార్య పిళ్లా సుజాత చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. మధురవాడకి చెందిన వాండ్రాసి శ్యామల, కురిటి సాయి వెంకట లోహిత్ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు.

వీరి పదవీ కాలం కూడా పొగిడించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరింత సేవ చేయడానికి తమకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

తీరంలో వ్యర్థాల తొలగింపు

కొమ్మాది: భారత నౌకాదళం పునీత సాగర అభియాన్‌లో భాగంగా ప్రతీ నెల నిర్వహిస్తున్న కోస్టల్ క్లీన్ అప్ కార్యక్రమం శనివారం యారాడ బీచ్, ఆర్‌కే బీచ్, కళింగ బీచ్, గంగవరం బీచ్, మేఘాద్రిపేట రివర్ చానల్, హార్బర్ వాటర్‌లో భారీ స్థాయిలో వ్యర్థాలు తొలగించారు. సముద్రాలు, నదులు, నీటి వనరులపై ప్లాస్టిక్ వాడకం ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఈస్టర్న్ నేవల్ కమాండ్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా 400 కేజీల వ్యర్థాలు తొలగించారు.



సేకరించిన వ్యర్థాలతో వలంటీర్లు

మనసున్న నాయకుడు సీఎం జగన్

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మారికవలస శారదానగర్‌లో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: పెద్ద వయస్సు కాదు, పెద్ద మనసున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస శారదానగర్, ముత్యాలమ్మ కాలనీ, సద్గురు సాయినాథ కాలనీ, వివేకానంద నగర్‌లో తాగునీటి పథకం పైప్‌లైన్ నిర్మాణం కోసం జీవీఎంసీ సాధారణ నిధులు రూ.1.02 కోట్లతో చేపట్టే పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మధురవాడ శివ శక్తినగర్ రోడ్డులోని సద్గురు సాయినాథ కాలనీ వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. మంచి పనులు చేయడానికి, ప్రజల మనస్సు గెలుచుకోవడానికి కావాల్సింది పెద్ద వయస్సు కాదని పెద్ద మనస్సు అని... అది మన ముఖ్యమంత్రి జగన్‌కు ఉందని చెప్పారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్న నాయకుడని కొనియాడారు. మారికవలస పరిసర ప్రాంతాల్లో ఇబ్బందులు కలిగిస్తున్న ఆకతాయిలను నియంత్రించాలని, కొమ్మాది కూడలి – మారికవలస సర్వీసు రోడ్డు ఏర్పాటు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర సమస్యలు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

రెండు నెలల్లో తాగునీటి సమస్య పరిష్కారం

జీవీఎంసీ 5వ వార్డులోని శారదానగర్‌తోపాటు వివేకానంద కాలనీ, సద్గురు సాయినాథ కాలనీ, ముత్యాలమ్మ కాలనీల్లో పైప్‌లైను నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేసి 2 నెలల్లో నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని డీఈ శ్రీహరి తదితరులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. ఈ వార్డులో ఇప్పటికే సుమారు రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమాల్లో జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి, తాగునీటి విభాగం డీఈ శ్రీహరి, వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, 7వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, 5వ వార్డు ఇన్‌చార్జి పోతిన సురేష్ కుమార్, జేఏస్ రెడ్డి, నాయకులు ముచ్చు రామారావు, బండారు లక్ష్మి, మితాన రమణమ్మ, కూన రమణ, వెంకటరావు, ఎస్.బాబ్జి, చేకూరి రజని, డి.కాశ్యరెడ్డి, కాశ్మీరు అప్పారావు, కల్లేపల్లి శంకర రావు, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి మెడికల్ కాలేజీలో వర్క్‌షాప్



జైపూర్ వైద్యుడు సతీష్ జైన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

మధురవాడ: నగరంలోని మధురవాడ గాయత్రి మెడికల్ కళాశాలలో ఈఎన్‌టీ ఎవరెస్ట్ పేరిట మూడు రోజులపాటు టెంపోరల్ బోన్ డిస్సెక్షన్, లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ జరుగుతోంది. ఇందులో భాగంగా శనివారం టెంపోరల్ బోన్ డిస్సెక్షన్, రేర్ కాంప్లికేటెడ్ సమస్యలపై లైవ్ సర్జరీ నిర్వహించి శిక్షణ ఇచ్చారు. దీనిని కళాశాల ఈఎన్‌టీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ ఆచార్య సూర్యప్రకాశరావు, చీఫ్ సర్జన్ డాక్టర్ కేతఈ అప్పారావు, ప్రొఫెసర్ డాక్టర్ డీఆర్‌కేఎల్ఎన్ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విభాగ అధిపతి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఇంత వరకూ దేశంలో 20 మందికి మాత్రమే ఇలాంటి శిక్షణలు ఇచ్చారని, తొలిసారిగా గాయత్రిలో 34మందికి ఒకే సారి ఇటువంటి శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. ఏపీతోపాటు తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల వైద్యులు 200 మంది వచ్చారన్నారు. వీరికి చెవిలో కొత్త ఆపరేషన్లపై జైపూర్‌కి చెందిన వరల్డ్ రినోండ్ స్కల్ బేస్ సర్జన్, ఈఎన్‌టీ నిపుణుడు సతీష్ జైన్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎనస్థీషియా డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ కూర్మనాథ్, ఈఎన్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్లు శ్రీనివాస్, నిహారిక, సౌమ్య, విహారి, సీనియర్ రెసిడెంట్స్ డాక్టర్ స్వాతి, డాక్టర్ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు దివీస్ రూ.3 లక్షల సాయం

తగరపువలస: తూడెం జెడ్పీ హైస్కూల్ రెండు ప్రధాన ద్వారాలకు భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం శనివారం పాఠశాల యాజమాన్యానికి రూ.3 లక్షలు అందించింది.

ఈ సందర్భంగా సంస్థ సామాజిక బాధ్యత అధికారి ఇ.ఎస్.నాగరాజు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి నరసయ్యమ్మ, ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ, ఉపాధ్యాయులు చంద్రమోహన్, సత్యమల్లిక తదితరులు పాల్గొన్నారు.